

హైకోర్ట్ సీజే అలోక్ అరాదేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

## గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ పార్థ సారథి, డీజీపీ రవిగుప్తాతోపాటు పలువురు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులను పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఆలయ ప్రధాన అర్చక బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. సీఎం రేవంత్‌ను ఆయన ఇంటివద్ద, సచివాలయంలో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## రెవెన్యూ శాఖను బలోపేతం చేయండి

### సీఎం రేవంత్‌రెడ్డికి రెవెన్యూ ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ నేతలు సచివాలయంలో సీఎంను కలిశారు. గ్రామ రెవెన్యూ పరిపాలన వ్యవస్థను పునర్నిర్మించాలని కోరారు. వివిధ శాఖల్లో క్రమబద్ధీకరించబడిన వీఆర్‌ఏలకు ఎంప్లాయ్ ఐడీలు కేటాయించి వేతనాలు చెల్లించాలని, వయసు పైబడిన, మరణించిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని విన్నవించారు. తమ విజ్ఞప్తులపై సీఎం సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ల బాధ్యులు తెలిపారు. సీఎంను కలిసినవారిలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, నిరంజన్‌రావు, అన్వర్, మాధవీరెడ్డి, కార్యదర్శులు మనోహర్ చక్రవర్తి, పల్నాటి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీ లచ్చిరెడ్డి, కే రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ హాన్ తదితరులు ఉన్నారు.

## బీసీ హామీలను నెరవేర్చాలి

### సీఎం రేవంత్‌రెడ్డికి జాతీయ బీసీ దళ్ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించి ఉపకులాల వారీగా అమలు చేయాలని, సంచార కులాలకు ప్రత్యేకంగా 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వివిధ బీసీ కులాలకు ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని విన్నవించారు. తెలంగాణ ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా బీసీలకు మేలు చేసేలా రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కుల గణనను నిర్వహించి, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాదే ఆ పనిని పూర్తి చేస్తే బీసీలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ వ్యతిరేకత వస్తుందనే?

- ఫార్మాసిటీ రద్దుకు న్యాయపరమైన చిక్కులూ వస్తాయని!
- 17 రోజుల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం వాపస్
- వాస్తవానికి గతంలోనే ముఖ్యమంత్రి విరుద్ధ ప్రకటనలు

"కాలుష్యకారకమైన ఫార్మాసిటీ హైదరాబాద్‌కు సమీపంలో కాకుండా, సుదూర ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. ప్రస్తుత ఫార్మాసిటీ భూముల్లో మెగా సిటీని ఏర్పాటు చేస్తాం.
- గత నెల 13న సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

"ఔటర్ రింగ్ రోడ్డు – ఆర్‌ఆర్‌ఆర్ మధ్యలో పారిశ్రామికవాడల గుర్తింపు కోసం 500 నుంచి 1,000 ఎకరాల భూమిని సేకరించండి.
- గత నెల 18న అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

"కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీ ఔటర్ రింగ్ రోడ్డు – ఆర్‌ఆర్‌ఆర్ మధ్యలోనే ఉన్నది. పారిశ్రామికవాడల ఏర్పాటుకు అదే అనువైన స్థలమని భావిస్తే, అక్కడే ఏర్పాటు కానున్న ఫార్మాసిటీ రద్దు ఎందుకు?
- నిన్నటి వరకు అందరిలో తలెత్తిన సందేహం



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 1 (నమస్తే తెలంగాణ): జీరో డిశ్చార్జి విధానంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో కాలుష్యాన్ని సాకుగా చూపి ఫార్మాసిటీని రద్దు చేయటం ఏమిటి?.. అందరిలో ఇవే అనుమానాలు. రద్దు కారణం వెనుక కారణం కాలుష్యమేనా? ఉద్దేశపూర్వకమా? అన్న ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో ఫార్మాసిటీని రద్దు చేయటం లేదని స్పష్టం చేశారు. 17 రోజుల వ్యవధిలోనే సీఎం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవటం వెనక కారణాలు ఏమై ఉంటాయి? అన్నదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే, సీఎం తాజా నిర్ణయంతో రాష్ట్రం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు కోసం వెచ్చించిన రూ.3–4వేల కోట్లు వృథా కాకుండా ప్రయోజనం కలగనున్నది.

### 12,300 ఎకరాల భూసేకరణ పూర్తి

రంగారెడ్డి జిల్లా పరిధిలో దేశంలోనే అతి పెద్ద ఫార్మాసిటీ ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో 12,300 ఎకరాల భూసేకరణ పూర్తి చేసింది. మొదటి దశ అనుమతులు కూడా వచ్చాయి. తుది అనుమతులు అనంతరం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 300–350 కంపెనీలకు కేటాయింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. కాలుష్యం కారణంగానే దాన్ని రద్దు చేస్తున్నట్టు సీఎం స్పష్టం చేసినట్టు అధికారిక ప్రకటన వెలువడింది. కాలుష్యం పేరు చెప్పి దాన్ని రద్దు చేయటమేమిటని అప్పట్లో పలువురు పారిశ్రామికవేత్తలు విస్మయం వ్యక్తం చేశారు. కాలుష్యమే లేని జీనోమ్ వ్యాలీ అంశాన్ని లేవనెత్తారు. అక్కడ ఫార్మా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఫార్మా తయారీ కంపెనీలు దాదాపు 113 వరకు ఉన్నాయి. జీరో డిశ్చార్జి విధానంలో వ్యర్థ జలాలను వంద శాతం శుద్ధి చేసి, ఆ జలాలను రీసైక్లింగ్ విధానంలో ఉపయోగించటంతోనే అక్కడ కాలుష్య సమస్య లేదు.

### సీఎం విరుద్ధ ప్రకటనపై విస్మయం

ఫార్మాసిటీ రద్దు నిర్ణయం తర్వాత ఐదు రోజుల వ్యవధిలో సీఎం రేవంత్ పారిశ్రామిక రంగంపై సమీక్ష నిర్వహించారు. ఆ సందర్భంగా నాచారం, కాటేదాన్ వంటి పారిశ్రామికవాడలను హైదరాబాద్ నుంచి దూరంగా ఏర్పాటు చేయాలనే గత ప్రతిపాదనపైన అధికారులతో చర్చించారు. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు – ఆర్‌ఆర్‌ఆర్ మధ్యలోకి తరలింపు కోసం కొండలు, గుట్టలతో పడావుగా ఉన్న 500–1000 ఎకరాల భూములతో క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాస్తవానికి నాచారం, కాటేదాన్ పారిశ్రామిక వాడల్లో విపరీతమైన కాలుష్య కారక ప్లాస్టిక్, రసాయన, ఇతర ఉత్పత్తి రంగాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు రెడ్ క్యాటగిరీలో ఉన్నవే. ఇంతటి కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్‌ఆర్–ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ఏర్పాటు చేయాలని భావించినపుడు, జీరో డిశ్చార్జితో ఏర్పాటయ్యే ఫార్మాసిటీకి కాలుష్యాన్ని కారణం చూపటం ఏమిటని అధికారుల్లో ప్రశ్నలు తలెత్తాయి. పైగా ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లో 75 శాతానికి పైగా ప్రభుత్వ భూములే. అందులోనూ 40 శాతానికి పైగా గుట్టలు, ఏనెలు (సాగులో లేనివి) ఉన్నాయి. ఈ క్రమంలో ఫార్మాసిటీ రద్దు ఎంతవరకు సమంజసం అనే వ్యాఖ్యలు వినిపించాయి.

### ఎట్టకేలకు ఉపసంహరణ

- ఫార్మా సిటీ రద్దుతో రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి వారికే ఇవ్వాలనే డిమాండ్ బలంగా వినిపించింది. పైగా ఫార్మాసిటీ కోసం భూముల్ని సేకరించిన ప్రభుత్వం టౌన్‌షిప్‌లకు వినియోగిస్తే రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉన్నది.
- ఫార్మాసిటీ రద్దుతో కేసీఆర్ ప్రభుత్వం వెచ్చించిన రూ.వేల కోట్లు కూడా వృథా అవుతాయి.
- ఫార్మాసిటీలో కంపెనీల ఏర్పాటుకు గతంలోనే వందల ఫార్మా సంస్థలు ముందుకొచ్చాయి. ఇంత డిమాండ్ ఉన్న దరిమిలా ఫార్మాసిటీని రద్దు చేస్తే పారిశ్రామికంగా తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి ప్రతికూల సంకేతాలు ఇచ్చినట్టు అవుతుంది.
- గ్రేటర్ పరిధిలోని కంపెనీలను ఔటర్ అవతలికి తరలించేందుకు మరోసారి భూసేకరణ చేపడితే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉంటుందన్న సూచనలు రావటంతోనే రద్దును ఉపసంహరించుకున్నట్టు తెలుస్తున్నది.

## ఫార్మాసిటీపై పీచేముడ్

మొదటిపేజీ తరువాయి...

పెంచేందుకు ప్రత్యేక వర్సిటీలు ఏర్పాటుచేస్తామని, ప్రముఖ పారిశ్రామిక వేత్తల ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఉంటుందని వెల్లడించారు. వాటిలో చదివిన వారికి సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయని, క్యాంపస్‌లోనే ప్లేస్‌మెంట్స్ ఇస్తామని చెప్పారు. విదేశాలకు వెళ్లే యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. 100 పడకల దవాఖాన ఉన్నచోటే అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. గతంలోని సీఎం క్యాంపు కార్యాలయాన్ని స్టేట్ గెస్ట్‌హౌస్‌గా మారుస్తామని చెప్పారు.

### మెట్రో అలైన్‌మెంట్‌లో మార్పు

శంషాబాద్ విమానాశ్రయానికి గత ప్రభుత్వం ప్రతిపాదించిన మార్గాలతో పోల్చితే దూరం తగ్గేలా అలైన్‌మెంట్ మార్చుతామని సీఎం తెలిపారు. గచ్చిబౌలి నుంచి విమానాశ్రయానికి మెట్రోలో వెళ్లేవారు ఉండరని చెప్పారు. బీహెచ్ఈఎల్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు 32 కిలోమీటర్లు వస్తుందని, ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టు వరకు ఏర్పాటు చేస్తామని వివరించారు. మరోవైపు నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఒవైసీ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణగుట్ట వద్ద విమానాశ్రయానికి వెళ్లే మెట్రోలైన్‌కు లింక్ చేస్తామన్నారు. అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రపురం వరకు, మైండ్ స్పేస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తామని చెప్పారు. కొత్తగా మెట్రో లైన్ల వల్ల ఖర్చు, దూరం తగ్గుతుందని తెలిపారు.

### నియామకాల్లో సామాజిక న్యాయం

ప్రభుత్వ శాఖల్లో అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం జరిగేలా చూస్తానని సీఎం చెప్పారు. ప్రతిభ కలిగిన అధిపతులను నియమించటం వరకు తాను చూస్తానని, వాళ్ల పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకొని, సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టంచేశారు. ఈ నెల 3న పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉన్నదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పదవులు ఇస్తామని వివరించారు. బంధుప్రీతికి తావు ఉండదని, పార్టీ కోసం పనిచేసిన వారితోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని తేల్చి చెప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవిని త్వరలో భర్తీ చేస్తామని, 100 రోజుల్లో జర్నలిస్టుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## మెట్రో వంకరటింకర!

మొదటిపేజీ తరువాయి...

వస్తున్నది. దూరం పెరిగితే నిర్మాణ వ్యయం పెరుగుతుంది. ఈ లెక్కన ప్రతి కిలో మీటరుకు రూ.200 కోట్ల చొప్పున రూ.8 వేల కోట్ల వ్యయం అవుతుంది. కానీ, కేసీఆర్ ప్రభుత్వం రూ.6,250 కోట్ల అంచనా వ్యయంతోనే నిర్మాణ పనులు చేపట్టింది. దీన్ని రద్దు చేసి కొత్త ప్రతిపాదన ప్రకారం వెళ్తే రూ.1,750 కోట్ల వ్యయం పెరుగుతుంది. అలాంటప్పుడు తక్కువ వ్యయంతో ఎలా పూర్తి చేస్తారన్న సందేహం వ్యక్తమవుతున్నది. అదేవిధంగా హైటెక్ సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వరకు మెట్రో మార్గాన్ని నిర్మిస్తామని చెప్పటం మరింత గందరగోళానికి దారితీసే అవకాశం ఉన్నదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు వేర్వేరు మార్గాలను నిర్మిస్తే ప్రాజెక్టు వ్యయం పెరుగుతుందే తప్ప తగ్గేందుకు అవకాశం ఉండదు.

### 2050 లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం మెట్రో ప్రణాళిక

హైదరాబాద్ మహానగరంలో మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ కోసం కేసీఆర్ ప్రభుత్వం పక్కాగా ప్రణాళికలు రూపొందించి, క్షేత్ర స్థాయిలో పనులు సైతం మొదలు పెట్టింది. 2050 లక్ష్యంగా నగరం నలుమూలలా 415 కిలోమీటర్ల దూరంతో మెట్రో మార్గాలు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్లాన్ రెడీ చేసింది. వివిధ దశల్లో వాటిని చేపట్టాలని స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇప్పటికే మొదటి దశ 69 కిలోమీటర్ల మార్గంలో రాకపోకలు సాగుతున్నాయి. రెండో దశలో రాయదుర్గం–ఎయిర్‌పోర్టు (31 కిలోమీటర్లు) ఉండగా, బీహెచ్ఈఎల్–లక్డీకాపూల్ (26 కిలోమీటర్లు), నాగోల్–ఎల్బీనగర్ (5 కిలోమీటర్లు) మార్గాలు ఉన్నాయి. ఇందులో ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణ పనులు క్షేత్ర స్థాయిలో ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం టెండర్లను సైతం పిలిచింది. మూడో దశలో 278 కిలోమీటర్ల మేర హైదరాబాద్ నలుమూలలా మెట్రోను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి అధ్యయనం చేసి డీపీఆర్‌లు రూపొందించేందుకు కన్సల్టెన్సీలను సైతం నియమించింది.

## బాబ్రీ కూల్చివేత అనంతరం అల్లర్లు..

### 30 ఏండ్ల తర్వాత నిందితుడి అరెస్ట్

బెంగళూరు, జనవరి 1: బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం చోటుచేసుకున్న అల్లర్లలో పాల్గొన్న నిందితుడిని 30 ఏండ్ల తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు. 1992 డిసెంబర్ 6న అయోధ్యలో బాబ్రీమసీదు కూల్చివేత జరిగినప్పుడు కర్ణాటకలోని హుబ్బలిలో కూడా అల్లర్లు చెలరేగాయి. ఆ సమయంలో పూజారి అనే వ్యక్తి అల్లర్లలో పాల్గొన్నాడు. అప్పుడు ఆయన వయసు 20 ఏండ్లు. ఈ కేసులో తాజాగా పూజారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఇప్పుడు ఆయన వయసు 50 ఏండ్లు. దీనిపై హుబ్బలి పోలీసు కమిషనర్ రేణుక సుకుమార్ మాట్లాడుతూ 'ఈ కేసు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నది. పెండింగ్ కేసులను క్లియర్ చేస్తున్న క్రమంలోనే తాజాగా పూజారిని అరెస్టు చేశాం' అని తెలిపారు.

## యువకుడిని కొట్టి, నగ్నంగా ఊరేగింపు

### రాజస్థాన్‌లో ఘటన

జైపూర్: రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఓ యువకుడిని చితక్కొట్టి, నగ్నంగా ఊరేగించిన ముగ్గుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. సదర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుఖ్‌రామ్ చోటియా వివరాల ప్రకారం.. బస్సి బెహ్లిమా గ్రామంలో దొంగతనం చేశాడనే అనుమానంతో షకీల్ అనే వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు చితక్కొట్టి, నగ్నంగా ఊరేగించారు. ఈ ఘటనను వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. 2014 నుంచి 2022 మధ్యలో షకీల్‌పై 5దొంగతనం కేసులు నమోదయ్యాయి.

# కేంద్రం నిధుల్లో వివక్ష

- గుజరాత్‌కు 101%.. రాష్ట్రానికి 11%
- గ్రాంట్ విషయంలో చిన్నచూపు
- 8 నెలల్లో కేంద్రం నుంచి వచ్చింది 11%
- బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధుల వరద
- కాగ్ తాజా నివేదికలో వెల్లడి

* 2023–24 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు కేంద్రం నుంచి అందిన గ్రాంట్

| నెల | (రూ. కోట్లలో) |
|---|---|
| ఏప్రిల్ | నిల్ |
| మే | 1,438.61 |
| జూన్ | 372.91 |
| జూలై | 506.3 |
| ఆగస్టు | 691.44 |
| సెప్టెంబర్ | 610.18 |
| అక్టోబర్ | 216.47 |
| నవంబర్ | 696.83 |
| మొత్తం | 4,532.74 |

బీజేపీ పాలిత రాష్ట్రాలకు నవంబర్ వరకు అందిన గ్రాంట్ (రూ. కోట్లలో)

| రాష్ట్రం | బడ్జెట్‌లో ప్రతిపాదన | కేంద్రం నుంచి అందింది | శాతం |
|---|---|---|---|
| గుజరాత్ | 16,290.35 | 16,582.02 | 101.79 |
| హర్యానా | 9,590.48 | 57,13.38 | 59.57 |
| త్రిపుర | 11,265.57 | 5,082.63 | 45.12 |
| మధ్యప్రదేశ్ | 44,113.15 | 19,452.70 | 44.10 |
| ఉత్తరాఖండ్ | 20,893.15 | 8,196.56 | 39.23 |
| ఛత్తీస్‌గఢ్ | 15,000.00 | 5,019.06 | 33.46 |
| రాజస్థాన్ | 33,981.74 | 9,767.74 | 28.74 |
| ఉత్తర ప్రదేశ్ | 1,01,203.30 | 26,371.82 | 26.06 |
| మహారాష్ట్ర | 62,647.02 | 12,272.29 | 19.59 |

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగుతున్నది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ. 41,259 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందుతుందని బడ్జెట్‌లో అంచనా వేసిన రాష్ట్ర ఆర్థికశాఖ చివరికి రూ.4,532 కోట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది బడ్జెట్ అంచనాల్లో 11 శాతం మాత్రమే. ఇప్పటికే కేంద్ర పన్నుల్లో వాటాలు ఇవ్వక రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతున్న మోదీ ప్రభుత్వం గ్రాంట్ విషయంలోనూ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షను స్వయంగా 'కాగ్' కూడా తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఏప్రిల్ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా విదిలించని కేంద్రం, మేలో మాత్రం రూ.1,438.61 కోట్లు మంజూరు చేసింది. జూన్‌లో రూ.372.91 కోట్లు, జూలైలో రూ.506.3 కోట్లు, ఆగస్టులో రూ.691.44 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.610.18 కోట్లు, అక్టోబర్‌లో రూ.216.47 కోట్లు, నవంబర్‌లో రూ.696.83 కోట్లు అందించింది. మొదటి 8 నెలల్లో ఒక్కో నెలకు సగటున బడ్జెట్ అంచనాల్లో 1.4 శాతం గ్రాంట్ మాత్రమే ఇచ్చింది. ఈ లెక్కన చూసుకుంటే మిగిలిన డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి మొత్తంగా మరో ఐదారు శాతం మాత్రమే గ్రాంట్ వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. అదే జరిగితే రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో 18 నుంచి 20 శాతం లోపే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందే అవకాశం ఉన్నది.

### బీజేపీ పాలిత రాష్ట్రాలకు అంచనాలకు మించి

గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయంలో తెలంగాణపై వివక్ష చూపుతున్న కేంద్రం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం బడ్జెట్ పద్దుతో సంబంధం లేకుండా గ్రాంట్ విడుదల చేస్తున్నది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు నవంబర్ నాటికే అంచనాల్లో 102 శాతం గ్రాంట్ ఇచ్చేసింది. కేంద్రం నుంచి రూ.16,290.35 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందుతుందని గుజరాత్ భావిస్తే 8 నెలల్లోనే ఆ మొత్తాన్ని దాటేసి రూ. 16,582.02 కోట్ల గ్రాంట్ అందించింది. అంటే ఇది ఆ రాష్ట్ర బడ్జెట్ అంచనాల్లో 101.79 శాతం. అదే తెలంగాణ విషయానికి వస్తే మాత్రం 11 శాతంతో సరిపెట్టింది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్‌కు 101.79 శాతం, హర్యానాకు 59.57 శాతం, త్రిపురకు 45.12 శాతం, మధ్యప్రదేశ్‌కు 44.10 శాతం, ఉత్తరాఖండ్‌కు 39.23 శాతం, ఛత్తీస్‌గఢ్‌కు 33.46 శాతం, రాజస్థాన్‌కు 28.74 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 26.06 శాతం, మహారాష్ట్రకు 19.59 శాతం గ్రాంట్‌ను విడుదల చేసింది. మణిపూర్ ఆగస్టు వరకు, అరుణాచల్‌ప్రదేశ్ సెప్టెంబర్ వరకు మాత్రమే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్‌కు వివరాలు సమర్పించాయి. గోవా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఎటువంటి సమాచారాన్ని కాగ్‌కు సమర్పించలేదు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలన్నీ కాగ్‌కు వివరాలు అందించగా, ఈ మూడు రాష్ట్రాలు మాత్రమే సమయానికి ఎందుకు వివరాలు సమర్పించడం లేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

## వస్తువుల ప్యాకెట్లపై వీటి ముద్రణ తప్పనిసరి

న్యూఢిల్లీ: అన్ని రకాల వస్తువుల ప్యాకెట్లపైనా జనవరి 1 నుంచి తప్పనిసరిగా మాన్యుఫ్యాక్చరింగ్ డేట్, యూనిట్ సేల్ ప్రైస్‌ను ముద్రించాలని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్ సోమవారం ఆదేశించారు. ఇప్పటివరకు ప్యాకేజ్డ్ కమాడిటీస్‌పై మాన్యుఫ్యాక్చరింగ్ తేదీ లేదా దిగుమతి చేసుకున్న తేదీ లేదా ప్యాకేజింగ్ తేదీల్లో ఏదో ఒకటి ముద్రిస్తే సరిపోయేది. తాజా నోటిఫికేషన్ ప్రకారం వస్తువు తయారుచేసిన తేదీని తప్పనిసరిగా ముద్రించాలి. దాంతోపాటు యూనిట్ సేల్ ప్రైస్‌ను కూడా ముద్రించడం తప్పనిసరి. ప్యాకేజ్డ్ ఐటమ్స్‌ను వేర్వేరు పరిమాణాల్లో అమ్ముతారు కాబట్టి, యూనిట్ సేల్ ప్రైస్‌ను వినియోగదారులు తెలుసుకోవడం ముఖ్యమని చెప్పారు. కేజీ కన్నా తక్కువ పరిమాణం గల ప్యాకెట్‌పై ఒక గ్రాము అమ్మకం ధరను, ఆ ప్యాకెట్ గరిష్ఠ చిల్లర ధరని ముద్రించాలన్నారు.

## 24 గంటల్లో 636 కరోనా కేసులు

న్యూఢిల్లీ, జనవరి 1: దేశంలో కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఆదివారం నుంచి సోమవారం నాటికి 24 గంటల్లో 636 కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసులు 4,394కి చేరాయి. తాజాగా ముగ్గురు మరణించారు. మరోవైపు దేశవ్యాప్తంగా జేఎన్.1 కేసులు 196 నమోదయ్యాయి. అత్యధికంగా కేరళలో 83, గోవా (51), గుజరాత్ (34), కర్ణాటక (8), మహారాష్ట్ర (7), రాజస్థాన్ (5), తమిళనాడు (4), తెలంగాణ (2), ఒడిశా (1), ఢిల్లీ (1) ఉన్నాయి.




నుమాయిష్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు తదితరులు

## నుమాయిష్ అంటే హైదరాబాద్

- చార్మినార్, ట్యాంక్‌బండ్ తర్వాత గుర్తొచ్చేది ఇదే
- పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): నుమాయిష్ హైదరాబాద్‌కు ఎంతో ప్రాధాన్యత తెచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్–2024 ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ అంటే చార్మినార్, ట్యాంక్‌బండ్ తర్వాత గుర్తొచ్చేది నుమాయిష్ అని తెలిపారు. ఏటా నుమాయిష్‌ను ప్రాధాన్యత తగ్గకుండా నిర్వహిస్తున్న సొసైటీకి అభినందనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం తరఫు నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాటితోపాటు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. 8 దశాబ్దాలుగా ప్రదర్శనను నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులను మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్, కార్యదర్శి బీ హన్మంతరావు, కోశాధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 6 రోజుల్లోనే 1,000 కోట్ల కిక్కు!

- 4 రోజుల్లో ఖజానాకు రూ.771 కోట్లు
- 30న గరిష్ఠంగా రూ.313 కోట్ల అమ్మకాలు
- 4,500పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



హైదరాబాద్/సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మద్యం ఏరులైపారింది. నూతన సంవత్సర వేడుకల వేళ అమ్మకాల జోరు పెరిగింది. 6 రోజుల్లోనే 1,000 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు జరిగినట్టు సమాచారం. డిసెంబర్ 28, 29, 30, 31 తేదీల్లో సుమారు రూ.771 కోట్లకుపైగా ఖజానాకు చేరినట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. డిసెంబర్ 30న ఒక్కరోజు అత్యధికంగా రూ.313 కోట్లు, 31న రూ.150 కోట్లపైగా మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ 28, 29 తేదీల్లో రూ.254 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 మద్యం డిపోల నుంచి మూడ్రోజుల్లో 6.51 లక్షల బీర్ కేసులు, 4.80 లక్షల లిక్కర్ కేసులు అమ్మడైనట్టు సమాచారం. డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు బార్లు ఓపెన్‌గా ఉంచి.. తాగినోళ్లకు తాగినంత మందును విక్రయించారు. డిసెంబర్ 30న రూ.313 కోట్ల మద్యం అమ్మకాలు జరుగగా.. గతేడాది రూ.250 కోట్లకుపైగా విలువైన మద్యం షాపులకు తరలివెళ్లింది. చివరి నాలుగు రోజుల అమ్మకాల విషయానికి వస్తే 2021 డిసెంబర్ చివరి నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల మద్యం అమ్ముడుపోగా.. 2022లో అది రూ.775 కోట్లు ఉండగా.. 2023లో రూ.771 కోట్లకుపైగా మద్యం అమ్ముడైనట్టు విశ్వసనీయ సమాచారం. నూతన సంవత్సర వేడుకల వేళ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,500లకు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు తెలిసింది. వీటిల్లో ట్రైకమిషనరేట్ల పరిధిలోనే 3,254 కేసులు నమోదయ్యాయి.

## గ్రేటర్‌లో నిమిషానికి 1,244 బిర్యానీల ఆర్డర్

### దేశంలో నిమిషానికి 1,722 కండోమ్స్: స్విగ్గీ



డిసెంబర్ 31 ఒక్కరోజే గ్రేటర్ హైదరాబాద్‌లో నిమిషానికి 1,244 బిర్యానీల ఆర్డర్ వచ్చినట్టు ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ తెలిపింది. హైదరాబాదీలు ఏకంగా 4.8 లక్షల బిర్యానీల ఆర్డర్‌తో గత రికార్డులను తిరగరాసినట్టు పేర్కొన్నది. గతంలో కంటే 1.6 రేట్లు ఆర్డర్లను అందుకున్నామని, వరల్డ్ కప్– 2023 ఫైనల్ సందర్భంగా ఈ తరహా ఆర్డర్లు వచ్చినా... అప్పుడు వచ్చిన దాని కంటే 1.3 లక్షల ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయని స్విగ్గీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిమిషానికి 1,722 కండోమ్‌లను ఆర్డర్ చేయగా, వీటిని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ద్వారా డెలివరీ చేసినట్టు స్విగ్గీ తెలిపింది.

## అమెరికా, దక్షిణకొరియాను అంతం చేస్తాం

### ఉత్తరకొరియా అధినేత కిమ్ హెచ్చరిక

సియోల్: తమను రెచ్చగొట్టే ప్రయత్నం మానుకోవాలని ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ అమెరికా, దక్షిణకొరియాను హెచ్చరించారు. లేదంటే ఆ రెండు దేశాలను పూర్తిగా నిర్మూలిస్తామని హెచ్చరికలు జారీచేశారు. అమెరికా, సౌత్ కొరియా మిలటరీ డ్రిల్స్ నేపథ్యంలో కిమ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే కనుక యూఎస్–నార్త్ కొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు పెరిగే అవకాశం ఉండటంతో ఆయుధ పరీక్షలను మరింత ముమ్మరం చేయాలని కిమ్ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. గతవారం 5 రోజులపాటు జరిగిన అధికార పార్టీ సమావేశంలో కిమ్ మాట్లాడుతూ.. మరో మూడు మిలటరీ గూఢచార ఉపగ్రహాలను ప్రయోగించనున్నట్టు తెలిపారు. అలాగే, మరిన్ని అణు పరీక్షలతోపాటు అటాకింగ్ డ్రోన్‌లను ఉత్పత్తి చేస్తామని చెప్పిన విషయం బయటకు వచ్చింది. కమాండింగ్ అధికారులతో ఆదివారం జరిగిన సమావేశంలో కిమ్ మాట్లాడుతూ జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే అణ్వాయుధాలను వాడడానికి కూడా వెనుకాడబోమని తెగేసి చెప్పారు. తమకు వ్యతిరేకంగా సైనిక ఘర్షణలకు రెచ్చగొడితే వారిని పూర్తిగా నిర్మూలిస్తామని హెచ్చరించారు.